సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 30 । జూన్ । 2024



యాదాద్రిలో టికెట్ల దందా

భక్తులు కొనుగోలు చేసిన దర్శనం టికెట్లతో కొందరు దందా చేస్తూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. - 8లో



సాధారణ కాన్పులు పెంచాలి

సాధారణ ప్రసవాలను పెంచాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. -10లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

భువనగిరి : నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ విహారీకృష్ణ పేర్కొన్నారు. శనివారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను యూనివర్సిటీగా మార్చే అవకాశం ఉందన్నారు. సంస్థలో 15 రకాల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్ల వయస్సు పైబడిన నిరుద్యోగ యువతీయువకులు జూలై 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మేదా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పలు రకాల కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సాయి యాదాద్రి సేవా ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు డి. అశోక్, దినేష్, కదారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి



కిరాణా షాపులో తనిఖీలు చేస్తున్న అధికారి

చౌటుప్పల్ : కిరాణం దుకాణాల్లో నిత్యావసర సరుకులు సొంతంగా ప్యాక్ చేసి తమ బ్రాండ్‌గా విక్రయించరాదని, తప్పనిసరిగా ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోవాలని లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి రామకృష్ణ స్పష్టం చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో శనివారం లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఐదు షాపుల్లో ప్యాకింగ్‌ల తయారీ, కస్టమర్ కేర్ నంబర్లు, ఈమెయిల్ అడ్రస్‌లు లేకపోవడాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. రూ.75వేల జరిమానా విధించారు. ప్యాకింగ్ చేసి విక్రయించాలంటే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. వినియోగదారులు ఫిర్యాదు చేయాలనుకుంటే జిల్లా కార్యాలయం లేదా 90106 51783ను సంప్రదించాలని సూచించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం



హెచ్‌ఎం నాగార్జునను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు

బొమ్మలరామారం : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. బొమ్మలరామారం మండలం జలాల్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పెండెం నాగార్జున, ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, తూముల వెంకటేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సభ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, తీన్మార్ మల్లన్నతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ.. ఉద్యోగులు రిటైర్‌మెంట్ అనంతరం సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంగిశెట్టి వెంకటేష్, ఎంపీటీసీ నర్సింహులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యం పెంచడానికే శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి

రామన్నపేట : అంగన్‌వాడీ టీచర్లలో బోధనా సామర్థ్యం పెంపొందించడానికే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి తెలిపారు. రామన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు శనివారం ఆమె హాజరై పలు సూచనలు చేశారు. నిర్దేశిత వయసులోపు పిల్లలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. వారికి సులభంగా అర్థం అయ్యేలా బోధన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారిణి శాగంటి శైలజ, మాస్టర్ ట్రైనర్ నవనీత, సూపర్‌వైజర్ బాలమణి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.

డ్యూటీ.. భారమైంది!



భువనగిరి బస్టాండ్‌లో కిక్కిరిసి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆర్టీసీలో అరకొర సిబ్బంది

- అదనపు డ్యూటీలతో అవస్థలు
- ఉచిత ప్రయాణ సౌకర్యంతో మరింత పెరిగిన పనిభారం
- సమస్యలు ఎదురవుతున్నా పట్టని అధికారులు
- ఖాళీలు భర్తీ చేయాలని, బస్సులు పెంచాలని కోరుతున్న డ్రైవర్లు, కండక్టర్లు

సాక్షి ఫోకస్

సాక్షి, యాదాద్రి : ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్ల కొరత వెంటాడుతోంది. అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. అవసరానికి సెలవు దొరకడమే గగనమైందని, అవిశ్రాంతంగా విధులు నిర్వహించాల్సి రావడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ఒత్తిడి మరింత పెరిగిందని వారు వాపోతున్నారు.

గుట్ట డిపో పరిధిలో ఇలా..

జిల్లాలో ఉన్న ఏకైక యాదగిరిగుట్ట డిపోలో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు 100 వరకు ఉన్నాయి. వాటిలో రోజూ సుమారు 35 వేల మంది ప్రయాణం చేస్తుంటారు. శని, ఆదివారాల్లో 50 వేల వరకు ఉంటారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా మరో 30 బస్సులు అదనంగా కావాల్సి ఉంది. సమస్య ఇలా ఉండగానే ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. తద్వారా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కానీ, అందుకు అనుగుణంగా కొత్త బస్సులను సంస్థ కేటాయించడం లేదు. దీనికి తోడు ఏళ్ల తరబడి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. అదనపు డ్యూటీలు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు 166, కండక్టర్లు 188 మంది పనిచేస్తున్నారు. అసలే అరకొర సిబ్బంది ఉండగా ఇటీవల 10 మంది డ్రైవర్లు, కండక్టర్లకు బదిలీ ఆర్డర్లు వచ్చాయి. మరో ఐదుగురు పదవీ విరమణ చేయనున్నారు.

కాలం చెల్లిన బస్సులు.. పరిమితికి మించి ప్రయాణం

మహాలక్ష్మి పథకం కింద ప్రరాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. అనంతరం బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ, సంస్థ అదనపు బస్సులు కేటాయించడం లేదు. దీంతో కాలం చెల్లిన బస్సులతోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. ఫిట్‌నెస్ లోపించడంతో తరచూ మొరాయిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియడం లేదు. ఊడిపోయే టైర్లతో ఆర్టీసీ ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. పెద్ద బస్సుల్లో సామర్థ్యం 55 మంది కాగా 150 మంది ఎక్కుతున్నారని, మినీ బస్సుల్లో 32 మందికి గాను 90 మంది ప్రయాణిస్తున్నారు. మోత్కూరు, రామన్నపేట, యాదగిరిగుట్ట మార్గాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఫుట్‌బోర్డులో వేలాడుతూ ప్రయాణం చేస్తుండడంతో డ్రైవర్లు, కండక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓపిక కూడగట్టుకుని విధులు



ఓపిక కూడగట్టుకుని విధులు నిర్వహిస్తున్నాం. ఒక్కో బస్సులో 120 మందికి పైబడి ప్రయాణికులు ఎక్కుతున్నారు. ప్రతి ఒక్కరి ఆధార్‌కార్డు క్షుణంగా తనిఖీ చేయాలి.. టికెట్ల లోడ్‌తో టిమ్ మిషన్లు కూడా స్ట్రక్ అవుతున్నాయి. పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేవు. మరో వైపు సిబ్బంది కొరత ఉంది. డ్యూటీ ఎక్కితే ఇంటికి ఎప్పుడు వెళ్తామో తెలియని పరిస్థితి ఉంది.

– తవిటి మురళి, కండక్టర్, యాదగిరిగుట్ట డిపో

నూతన డిపోల ప్రస్తావనే లేదు

జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అంతే కాకుండా యాదాద్రి జిల్లా మీదుగా హైదరాబాద్, ఉమ్మడి వరంగల్, నల్లగొండ, మెదక్ జిల్లాలకు ఆర్టీసీ బస్సుల్లో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో భువనగిరి, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరులో నూతన డిపోలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వీటి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. నూతన డిపోలు ఏర్పాటు చేస్తే బస్సులతో పాటు సిబ్బంది పెరగనున్నారు.

బస్సులు మొరాయిస్తున్నాయి



మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ఆక్యుపెన్సీ రేటు ఒక్కసారిగా పెరిగింది. పరిమితికి మించి ఎక్కుతుండడంతో బస్సులపై ఓవర్ లోడ్ పడుతుంది. ఒక్కోసారి స్టార్ట్ కావడం లేదు. మొరాయిస్తుండడంతో బస్సులు నడపడం కష్టంగా ఉంది. మరోవైపు అడుగడుగునా బస్సు ఆపక తప్పడం లేదు. లేనట్లయితే మహిళలు గొడవ చేస్తున్నారు. బస్సుల సంఖ్య పెంచాలి.

– బాల్ నర్సింహ, డ్రైవర్, యాదగిరిగుట్ట డిపో

సెలవులు దొరకడం లేదు



ఉచిత ప్రయాణంతో మహిళలు పెద్ద సంఖ్యలో బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మాకు సెలవులు కూడా దొరకడం లేదు. నెలలో మూడు సెలవులు ఉంటాయి. అందులో కనీసం ఒక్క సెలవు కూడా వాడుకోలేని పరిస్థితి ఉంది. డ్రైవర్, కండక్టర్ల కొరత ఉంది. అదనపు డ్యూటీలతో సతమతం అవుతున్నాం. ఒక్కో బస్సులో 120 మంది ఎక్కుతుండడంతో మాపై ఒత్తిడి పెరిగింది.

– సీహెచ్.రమణ, కండక్టర్, యాదగిరిగుట్ట డిపో

చాలా ఇబ్బంది పడుతున్నాం



ఆర్టీసీ బస్సుల్లో ఆరు నెలలుగా రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో సమస్యలు అధికం అయ్యాయి. ఎక్కడ అవసరం ఉంటే అక్కడ బస్సు ఆపమని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఆపకుంటే గొడవ చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.ఎక్కడపడితే అక్కడ ఆపితే టైం సరిపోవడం లేదు. ట్రిప్పులు పడడం లేదు. అదనపు టైం పని చేయవలసి వస్తుంది.తినడానికి కూడా టైం దొరకడం లేదు.

– జి.నర్సింహ, కండక్టర్, నార్కట్‌పల్లి డిపో



స్వామి, అమ్మవారికి పూజలు చేసి హారతినిస్తున్న ప్రధాన అర్చకుడు

యాదాద్రిలో భక్తుల ఆరాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచి న ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. అలాగే ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణపుష్పార్చన, నిత్యకల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

ఎస్‌జీటీల బదిలీలకు కసరత్తు

- 886 మంది దరఖాస్తు
- సీనియార్టీ జాబితా విడుదల

భువనగిరి : స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియడంతో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ) బదిలీలకు విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. బదిలీల కోసం 886 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే సీనియార్టీ జాబితాను కూడా ప్రకటించారు. 29వ తేదీ నుంచి ఎస్‌జీటీల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అనంతరం వెబ్ ఆప్షన్‌కు అవకాశం కల్పించనున్నారు. కాగా ఇటీవల పదోన్నతి పొందిన ఎస్‌జీటీలు ఇంకా 11 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరలేదు. నిర్ణీత గడువులోపు వారు విధుల్లో చేరకపోతే ఆ పోస్టుల్లో సీనియార్టీ జాబితా ప్రకారం తదుపరి స్థానంలో ఉన్న వారికి పదోన్నతి కల్పించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే ఎస్‌జీటీల బదిలీలు ఆలస్యం అయ్యే అవకాశం లేకపోలేదు.

తప్పనిసరి బదిలీల జాబితాలో 449 మంది

స్కూల్ అసిస్టెంట్ల బదిలీల అనంతరం 503 ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో 1,217 మంది ఎస్‌జీటీలు పని చేస్తుండగా.. ఇందులో 431 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతి లభించింది. మిగిలిన ఎస్‌జీటీలతోపాటు పండిట్‌లు 886 మంది ఉన్నారు. వీరిలో ఒకే చోట ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయిన వారికి బదిలీ కానుంది.

అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం

ఉన్నతస్థాయి ఆదేశాలకు అనుగుణంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడుతున్నాం. ఎస్‌జీటీల సీనియార్టీ జాబితా విడుదల చేశాం.అభ్యంతరాలు స్వీకరించి సవరణ చేస్తున్నాం. వెబ్ ఆప్షన్ రావల్సి ఉంది.

– నారాయణరెడ్డి, డీఈఓ

2న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

భువనగిరి టౌన్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 2వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన ఐదేళ్లలో శాఖలు చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జెడ్పీటీసీ చైర్మన్, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించనున్నట్లు వివరించారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని.. సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

బొగ్గు గనులు ప్రైవేట్ పరం చేసే కుట్ర



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

భువనగిరిటౌన్ : మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లిలో ఉన్న బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. బొగ్గు గనులను ప్రైవేట్ రంగానికి కట్టబెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే బొగ్గు తవ్వాల్సి ఉండగా, వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వేలంపాటను ప్రారంభించడం శోచనీయమన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయబోమని చెప్పి ఇప్పుడు అదే దిశగా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, బొల్లు యాదగిరి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేష్, మాయ కృష్ణ, గంగాదేవి సైదులు, ఎండీ పాషా, బూరుగు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేష్, ఎం ఏ ఇక్బాల్, మనం ఉపేందర్,గుండు వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన జడ్జి జయరాజు



న్యాయవాదులకు నూతన చట్టాల పుస్తకాలు అందజేస్తున్న జడ్జి జయరాజు

భువనగిరి క్రైం: కొత్తగా అమల్లోకి రానున్న క్రిమినల్ మేజర్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు పేర్కొన్నారు. భువనగిరి కోర్టులో శనివారం న్యాయవాదులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థిగా ఉంటూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన చట్టాల్లో చేర్పులు, మార్పులు అవసరమని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. అవగాహన తరగతులకు హాజరైన న్యాయవాదులకు రాపోలు భాస్కర్ మాతృమూర్తి స్మారకార్థం నూతన చట్టాల బుక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, సభ్యులు నాగారం అంజయ్య, రాపోలు భాస్కర్, జూకంటి రవీందర్, ఎండీ రహీం, శ్రీకాంత్, గోద వెంకటేశ్వర్లు గౌడ్, కలకుంట్ల జయకృష్ణ, కుక్కదూగ సోమయ్య, పాల్వంచ జగతయ్య, తడక మోహన్, బొల్లేపల్లికుమార్, చింతల విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎండీ నిహాల్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి ఏయిమ్స్‌లో పూర్తి వైద్యం

- పనులు త్వరగా పూర్తి చేయాలి
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్‌లో నిర్మిస్తున్న భవన నమూనాల గురించి ఎంపీ, ఎమ్మెల్యేకు వివరిస్తున్న డైరెక్టర్ వికాస్ భాటియా

సాక్షి, యాదాద్రి, బీబీనగర్ : వచ్చే సంవత్సరం మార్చి నాటికి బీబీనగర్ ఏయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన ఏయిమ్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 700 పడకల ఆస్పత్రి, ఓపీ వైద్యం పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు. నిధుల కొరత లేదని, పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ఆలస్యంగా పనులు చేస్తుందన్నారు. మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆస్పత్రిలో ఉన్న మూడు డయాలసిస్ బెడ్లను 50కి పెంచాలని చెప్పానన్నారు. అలాగే కేంద్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి, హెల్త్ సెక్రటరీని కలిసి ఆస్పత్రిలో పోస్టులు పెంచాలని కోరుతానని చెప్పారు. ఔట్ సోర్సింగ్‌లో స్థానికులైన వారికి టెక్నికల్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

రైల్వే సమస్యలపై ప్రత్యేక దృష్టి

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న రైల్వే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎంపీ చెప్పారు. అన్ని రైల్వే స్టేషన్లలో పర్యటించి అక్కడి ప్రయాణికులు, రైల్వే స్టేషన్ మాస్టర్‌లతో సమస్యలు, అవసరాలపై చర్చిస్తానన్నారు. రైల్వే హాల్టింగ్‌లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లతో పాటు అన్ని సమస్యలపై పార్లమెంట్ సమావేశాల తర్వాత దక్షిణమధ్య రైల్వే జీఎంను కలుస్తానన్నారు.

ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై రైతులతో చర్చ

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు విషయంలో వస్తున్న ఆరోపణలపై రైతులతో చర్చిస్తానన్నారు. భూ సేకరణ వల్ల రైతులకు ఎదురవుతున్న కష్టాలు, నష్టాలు క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తానన్నారు. అంతకు ముందు ఏయిమ్స్‌లో చేపట్టిన పనుల పురోగతిపై తెలుసుకున్నారు. భవన నిర్మాణాలు, పూర్తయినవి, కొనసాగుతున్నవి, వైద్యసేవలు, డ్రోన్ ద్వారా అందజేస్తున్న సేవలు, ఎంబీబీఎస్ బ్యాచ్‌లు.. తదితర వివరాల గురించి తెలుసుకున్నారు. వాటి గురించి డైరెక్టర్ వికాస్ భాటియా ప్రొజెక్టర్ ద్వారా ఎంపీ, ఎమ్మెల్యేకు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరగా పూర్తి చేయించాలని ఎంపీ సూచించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేసి డైరెక్టర్‌ను అభినందించారు.

ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆందోళన



కార్యకర్తలకు నచ్చజెబుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ ఏయిమ్స్ సందర్శనకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఎయిమ్స్ వైద్య కళాశాలలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ఆందోళనకు దిగారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించే సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ ఉద్యోగాలకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో డైరెక్టర్ హస్తం ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పెద్ద చెరువులోకి డ్రెయినేజీ నీరు వదులుతున్నారని, సర్జికల్ మెడికల్ సామగ్రిని ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి లెప్రసీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన వేస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యే కలగజేసుకొని వారికి నచ్చజెప్పారు. ఉద్యోగ నియామకాల్లో లంచాలు తీసుకున్నట్లు ఆధారాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. నియామకాలు పారదర్శకంగా జరగాలని డైరెక్టర్ వికాస్ భాటియాకు సూచించారు.

‘గెజిటెడ్ సంతకం కోసం డబ్బులు తీసుకుంటున్నారు’

భువనగిరిటౌన్ : గెజిటెడ్ సంతకం చేసినందుకు కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. గెజిటెడ్ సంతకాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే వాచ్‌మన్లు, అటెండర్లు, ఇతర క్షేత్ర సిబ్బంది అధికారులతో సంతకాలు చేయించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రూ.200 నుంచి రూ.2 వేల వరకు తీసుకుంటున్నారని, ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు సంతకం చేయించుకోలేక వెనుదిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య ఎక్కువగా జిల్లా ఏరియా ఆస్పత్రిలో ఉందన్నారు. గెజిటెడ్ సంతకం కోసం మండలానికి ఒక అధికారిని నియమించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఉపాధ్యక్షుడు చెన్న రాజేష్, సభ్యులు రత్నం శ్రీకాంత్ తదతరులు ఉన్నారు.

క్లుప్తంగా

స్కూటీ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన నవీన్

కేతేపల్లి: కేతేపల్లిలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన నవీన్ హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. నవీన్ శనివారం స్కూటీపై హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లిలోని నిమ్మలమ్మ చెరువు సమీపంలోకి చేరుకోగానే స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్ ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం జీవీకే ఇమ్మార్ 1033 అంబులెన్స్‌లో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

చౌటుప్పల్ : పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో శనివారం ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా తంగడపల్లి రోడ్డులోని ఓ కిరాణా దుకాణంలో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పలు పాన్ షాపుల్లో సివిల్ పోలీసులు తనిఖీలు నిర్వహించి అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

మూడు టిప్పర్లు పట్టివేత



చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో టిప్పర్లు

చింతపల్లి: నిబంధనలకు విరుద్ధంగా దేవరకొండ మండల కేంద్రం నుంచి చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి, గడియగౌరారం గ్రామాలకు మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను శనివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. మైనింగ్ అధికారుల అనుమతుల మేరకు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే మట్టి తరలించేందుకు అనుమతులు ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలోనూ మట్టిని తరలిస్తుండడంతో టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. పట్టుబడిన టిప్పర్లను తహసీల్దార్‌కు సరండర్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని పంతంగి గ్రామంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలపై ఇరిగేషన్ శాఖ డీఈ రాజవర్ధన్‌రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారని, అందుకు సంబంధించి నంబర్లతో సహా టిప్పర్ వాహనాల వివరాలు పోలీసులకు అందజేశారు. అదేవిధంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులో గల ఎర్రకుంటలోనూ అక్రమంగా అధికార పార్టీకి చెందిన నాయకులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా దగ్గరుండి మట్టిని తీసుకెళ్తున్నారు. దీనిపై కూడా పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులు కుంటను సందర్శించారు. వాహనాల వివరాలు సేకరించారు.

యాదాద్రి ఆలయంలో టికెట్ల దందా

- భక్తుల నుంచి దర్శనం టికెట్లు తీసుకుని వాటిని వేరేవారికి అంటగడుతున్న అక్రమార్కులు
- ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు



యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం



తేదీ, వివరాలు లేకుండా విక్రయిస్తున్న రూ.150 టికెట్

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. భక్తులు కొనుగోలు చేసిన దర్శనం టికెట్లను తీసుకొని.. తిరిగి ఆ టికెట్లనే ఇతర భక్తులకు విక్రయిస్తూ దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారు కొందరు అక్రమార్కులు. నెలన్నర క్రితం కొండపైన కొబ్బరికాయలు అమ్మే వ్యక్తితో పాటు శుక్రవారం కొబ్బరి చిప్పల సేకరణ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే మరో వ్యక్తి రూ.150 దర్శనం టికెట్లు భక్తుల వద్ద తీసుకొని ఇతర భక్తులకు అమ్మినట్లు తెలిసింది. ఇవే కాకుండా ప్రసాదం, బ్రేక్ దర్శనం వంటి టికెట్లలో సైతం ఇదే తంతు నడుస్తోందని, అక్రమార్కులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ మార్పు రావడం లేదని భక్తులు అంటున్నారు.

తొందరగా దర్శనం చేయిస్తామంటూ..

యాదాద్రీశుడి దర్శనానికి గంటల కొద్దీ సమయం పడుతోంది. దీనిని ఆసరాగా చేసుకొని కొండపైన కొంతమంది అక్రమార్కులు తొందరగా దర్శనాలు చేయిస్తామంటూ భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ నెల 27వ తేదీన రూ.150 టిక్కెట్ కొనుగోలు చేసిన హైదరాబాద్‌కు చెందిన భక్తుడు సుధాకర్‌రావు, అతడి కుటుంబ సభ్యులు గోల్డెన్ క్యూలైన్‌లో వెళ్తున్న క్రమంలో వారి నుంచి ఆలయ సిబ్బంది కాకుండా కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే టంటం వెంకటేష్ అనే వ్యక్తి 43 టికెట్లు తీసుకుని దగ్గర పెట్టుకున్నారు. ఆ టికెట్లు ఇతర భక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నెలరోజుల క్రితం కొండపైన కొబ్బరికాయల దుకాణంలో పనిచేసే యాదగిరి అనే వ్యక్తి పది మంది భక్తులు దర్శనానికి వచ్చిన సమయంలో 10 టికెట్లు కాకుండా.. 5టికెట్లు తీసుకొండి నేరుగా దర్శనానికి పంపిస్తా అని మభ్యపెడుతూ ఆలయ సిబ్బందికి పట్టుబడ్డాడు.

బ్రేక్ దర్శనం, ప్రసాద విక్రయాల్లో సైతం..

ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు యాదాద్రి ఆలయంలో బ్రేక్ దర్శనాలు ఉంటాయి. బ్రేక్ టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఉత్తర రాజగోపుర ద్వారం నుంచి, తూర్పు త్రితల రాజగోపుర ద్వారం గుండా గర్భాలయంలోకి వెళ్లి స్వయంభూలను దర్శించుకుంటారు. కానీ శని, ఆదివారాలు, ప్రత్యేక సెలవు రోజుల్లో మాత్రం అక్రమార్కులు ఉత్తర ద్వారం కాకుండా.. పడమటి ద్వారం గుండా భక్తులను నేరుగా దర్శనానికి తీసుకెళ్లి, భక్తుల నుంచి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే కాకుండా ప్రసాదం సెక్షన్‌లో సైతం అక్రమాలు జరుగుతున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రసాద విక్రయశాలలో ఉదయం సమయంలో కొంతమంది వ్యక్తులు టికెట్లు లేకుండానే ప్రసాదాలు తీసుకొచ్చి భక్తులకు బయట అమ్ముతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ టికెట్లతో అక్రమాలకు చెక్..

తిరుపతిలో మాదిరిగా ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తే ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టవచ్చిన భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు విక్రయిస్తే భక్తులు ఏ సమయానికి టికెట్లు కొన్నారు, ఎంత మందికి టికెట్లు తీసుకున్నారు, ఏ తేదీన కొనుగోలు చేశారని తెలుస్తుంది. దేవస్థానం బుకింగ్ కౌంటర్‌లో ఇచ్చే టికెట్లపై ఎలాంటి వివరాలు లేకపోవడంతో అక్రమాలు జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఈఓగా భాస్కర్‌రావు వచ్చిన తర్వాత ఆన్‌లైన్ టికెటింగ్ విధానం తీసుకొచ్చినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కాక.. తిరిగి మ్యాన్‌వల్ గానే టికెట్లు విక్రయిస్తున్నారు. దీంతో అక్రమాలకు జరుగుతున్నాయని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

కొంతమంది అధికారుల కనుసన్నల్లో..?

యాదాద్రి ఆలయంలో విధులు నిర్వహించే కొంతమంది అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే ఈ రీసైక్లింగ్ దందా జరుగుతున్నట్లు భక్తుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు తమకు సంబంధించిన యువకులను, ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నట్లు తెలిసింది. అధికారులు, సిబ్బందికి సంబంధించిన ఎవరైనా దర్శనాలకు వస్తే ప్రైవేట్ వ్యక్తులు లేదా యువకుల ద్వారా దర్శనాలకు పంపించడంతో పాటు కొండ దిగే వరకు వారితోనే ఉండి ప్రసాదాలు అందజేసి, అధిక డబ్బులు తీసుకుంటున్నట్లు స్థానికులు అంటున్నారు.

నా భార్య, కుమారుడిని చేరదీయండి

- అండగా ఉండాల్సిన నేను వెళ్లిపోతున్నా..
- లేఖరాసి ఆత్మహత్య చేసుకున్న ఫొటోగ్రాఫర్
- అప్పులు తీర్చే మార్గం లేక బలవన్మరణం



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఖమ్మంక్రైం : 'మానస నువ్వంటే చెప్పలేనంత ప్రేమ. అనారోగ్యంతో బాధపడుతున్న నీకు తోడుగా ఉండాల్సింది పోయి వెళ్తున్నా.. మన కుమారుడు నమన్‌రెడ్డిని జాగ్రత్తగా చూసుకో.. నాన్నా(కుమారుడిని ఉద్దేశించి) నీ చేయి పట్టుకుని ప్రపంచాన్ని చూపించాల్సి ఉన్నా చేయి విడిచిపెట్టి పోతున్నా. నన్ను క్షమించండి. అమ్మ, అక్క, తమ్ముళ్లు, అత్తయ్య, మామయ్యలు, బాబాయిలు, పిన్నిలు మీరంతా నా కొడుకు, భార్యను జాగ్రత్త గా చూసుకోండి. నాపై కోపం ఉంటే వారిపై చూపకుండా చేరదీసి ఆదుకోండి' అంటూ లేఖ రాసిన ఓ ఫొటోగ్రాఫర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఎరసాని శ్రీనివాస్‌రెడ్డి(40) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ భార్య మానస, కుమారుడు నమన్‌రెడ్డితో కలిసి ఉంటున్నాడు. అయితే కొంతకాలంగా ఆయన లోన్ యాప్‌లు, క్రెడిట్‌కార్డుల ద్వారా తీసుకున్న అప్పులు పెరిగి తీర్చలేని పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యాన కొన్నాళ్ల క్రితం ఖమ్మంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో శుక్రవారం సాయంత్రం ఇక్కడకు చేరుకుని లాడ్జీలో గది అద్దెకు తీసుకున్నాడు. శని వారం ఉదయం ఆయనకు టీ ఇవ్వడానికి వెళ్లిన సిబ్బంది ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి తలుపులు పగులకొట్టి చూడగా శ్రీనివాస్‌రెడ్డి ఉరి వేసుకుని కనిపించాడు. ఆయన వద్ద లభించిన లేఖ, చిరునామా ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కాగా, అప్పులు పెరగడంతో తీర్చే మార్గం లేక బలవన్మరణానికి పాల్పడగా, శ్రీనివాసరెడ్డి తన భార్య, కుమారుడిని విడిచిపెట్టలేక సంఘర్షణకు గురైనట్లు లేఖ ద్వారా తెలియడంతో చదివిన వారంతా కంటతడి పెట్టారు. కాగా, ఆయన మృతదేహాన్ని అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు, సిబ్బంది సాయంతో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ ఎస్‌ఐ రఫీ తెలిపారు.

గట్టికల్లు ఊర చెరువు ఆక్రమణ

- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తుల ఆరోపణ



గట్టికల్లు గ్రామంలోని ఊర చెరువులో పోసిన మట్టి



చెరువు కట్టకు వేసిన గూనలు

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని గట్టిగల్లు గ్రామంలో ఉన్న ఊర చెరువుని పరిసర ప్రాంతాల్లోని రైతులు గత నాలుగేళ్లుగా ఆక్రమించుకుంటున్నారని ఆ గ్రామానికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. చెరువు మట్టితో శిఖం భూములను పూడ్చి వేస్తూ ఎకరాల కొద్ది భూమిని ఆక్రమించుకుంటున్నారని అంటున్నారు. చెరువులోని నీరు కూడా బయటకు వెళ్లేలా ఏకంగా భారీ సిమెంట్ పైపులు వేశారని ఆరోపిస్తున్నారు.

నోటీసులు ఇచ్చినా..

గట్టికల్లు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 143లో 29.04 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊర చెరువు ప్రస్తుతం 12 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైనట్లు రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు ఆక్రమించిన వారికి ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇవ్వడమే కాకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా పిటిషన్ ఇచ్చారని గ్రామస్తులు తెలుపుతున్నారు. అయినా వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో కిందిస్థాయి అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారనీ ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో చెరువు కనుమరుగయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు మృతి

రామన్నపేట : పొలం దున్నుతుండగా.. ట్రాక్టర్‌పై నుంచి పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన శనివారం రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపంపుల గ్రామానికి చెందిన వనం నరేష్, శోభ దంపతులకు ఇద్దరు కుమారులు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు గణేష్(7) రామన్నపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. శనివారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో శోభ తన కుమారులను తీసుకొని తల్లిగారింటికి బయల్దేరగా.. భర్త వారించి పెద్ద కుమారుడు గణేష్‌ను తన వెంట వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లాడు. గణేష్ తండ్రితో పాటు ఇంటికి వెళ్లకుండా పొలం దున్నుతున్న తన బాబాయి నరేష్ ట్రాక్టర్ ఎక్కి పక్కన కూర్చున్నాడు. పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు గణేష్ టాక్టర్‌పై నుంచి కిందపడడంతో ట్రాక్టర్ వీల్స్ అతడి నడుము మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన , నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా శుక్రవారం రాత్రికే ఆలయానికి చేరుకున్న భక్తులు తెల్లవారుజామున కృష్ణానదిలో పుణ్య స్నాణాలుచేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలు సీజ్

మిర్యాలగూడ అర్బన్: నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ టూ టౌన్ సీఐ నాగార్జున అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా నడిపే వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు నంబర్ ప్లేట్ వేయించి పంపామని, జూలై 1వ తేదీ నుంచి ఇక ఆ పరిస్థితి ఉండదని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా నడిపే ప్రతి వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నంబర్ ప్లేట్ లేని వాహనాలను పరిశీలిస్తున్న సీఐ నాగార్జున

ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ క్రిష్ణయ్య, పోలీస్ సిబ్బంది యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల నిధుల డ్రాపై చర్యలు తీసుకోవాలి

- అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య



ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎఫ్ నాయకులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూనిర్వాసితులకు మంజూరైన నిధులకు సంబంధించి చెక్‌లపై ఆర్డీఓ సంతకం ఫోర్జరీ చేసి డబ్బులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వస్కుల మట్టయ్య మాట్లాడుతూ.. మిర్యాలగూడ ఐడీబీఐ బ్యాంకులో నిర్వాసితులకు మంజూరైన మూడు చెక్కుల ద్వారా లక్షలాది రూపాయాలను డ్రా చేసుకున్నారని ఆరోపించారు. ఆర్డీఓ సంతకం ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేసిన వారి పేర్లు తెలిసినా వారి నుంచి డబ్బులు రికవరీ చేసి, క్రిమినల్ కేసులు పెట్టకుండా అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అమాయకమైన రైతులకు న్యాయం చేయకుండా దళారులకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. నిజమైన భూనిర్వాసితులకు పరిహారం అందించకుండా కేవలం పర్సంటేజ్ ఇచ్చిన వారికి మాత్రమే పరిహారం అందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని లేదంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి కాశీ, వస్కుల సైదమ్మ, ధీరావత్ మోహన్‌నాయక్, రామాంజి, జ్యోతి, వస్కుల చంద్రకళ, సందీప్ పాల్గొన్నారు.

'అబార్షన్' ఘటనపై విచారణ..

ఆస్పత్రులు సీజ్

- ఇటీవల అబార్షన్ చేయడంతో చివ్వెంల మండలానికి చెందిన గర్భిణి సుహాసిని మృతి
- తీవ్రంగా స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ
- డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో తనిఖీలు
- హుజూర్‌నగర్‌లో కమల, కోదాడలో విజయ, మఠంపల్లిలో ఆస్పత్రి సీజ్
- రికార్డులు స్వాధీనం



కోదాడలోని విజయ హాస్పిటల్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి : ఇటీవల చివ్వెంల మండలానికి చెందిన ఓ మహిళకు అబార్షన్ చేసి.. ఆమె ప్రాణాలు బలిగొన్న ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తీవ్రంగా స్పందించింది. విచారణ చేసి ఈ ఘటనలో పాలుపంచుకున్న మూడు ప్రైవేట్ ఆస్పత్రులను డీఎంహెచ్‌ఓ శనివారం సీజ్ చేశారు. ఓ వ్యక్తి తన భార్యకు లింగనిర్ధారణ పరీక్షలు చేయించాడు. ఆడపిల్ల అని తేలడంతో వద్దనుకొని అబార్షన్ చేయించాడు. ఆరోగ్యం విషమించి ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ కేసుతో సంబంధం ఉన్న ఆస్పత్రులపై అధికారులు వేటు వేశారు.

ఆస్పత్రుల తనిఖీ

చట్ట విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేయడమే కాక అబార్షన్ చేసి ఓ గర్భిణి మృతికి పరోక్షంగా కారణమైన కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలలను డీఎంహెచ్‌ఓ కోటాచలం శనివారం తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన కోదాడలోని విజయవైద్యశాలను సీజ్ చేశారు. ఈ వైద్యశాలలో ఉన్న స్కానింగ్ సెంటర్‌కు కూడా అనుమతి లేకపోవడంతో కేసు నమోదు చేశారు. అబార్షన్ చేసిన హుజూర్‌నగర్‌లోని న్యూ కమల హాస్పిటల్‌ను సీజ్ చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అనుమతులు లేని కమల డెంటల్ హాస్పిటల్‌ను సీజ్ చేశారు. మఠంపల్లిలో ప్రభుత్వ డాక్టర్ నాగేందర్ నిర్వహిస్తున్న ప్రైవేట్ వైద్యశాలను సీజ్ చేశారు. గర్భిణి మృతికి కారణమైన వారందరిపై ఇప్పటికే పోలీస్ కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌ఓ చెప్పారు. ఇందులో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ నాగేందర్ పాత్రకూడా ఉందని ఇతనిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ సెంటర్లలో ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, వాటిని ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇక ముందు ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే జైలుశిక్ష ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్, డిప్యూటీ డెమో అంజయ్య, కార్తిక్, ఇందిరాల రామకృష్ణ, మఠంపల్లి మండల వైద్యాధికారి సుధాకర్‌నాయక్, ఫార్మసిస్టు లక్ష్మణ్‌గౌడ్, ఎల్‌టీ రమేష్, వైద్యసిబ్బంది ఉన్నారు.

కాంపౌండర్‌లే వైద్యులు..

అప్పటికే ఏడునెలల గర్భిణిగా ఉన్న సుహాసినికి హుజూర్‌నగర్‌లోని న్యూ కమల వైద్యశాలలో పని చేస్తున్న ఇద్దరు కాంపౌండర్లు అబార్షన్ పిల్స్ ఇచ్చారు. వాస్తవానికి ఆరు వారాల గర్భిణికి మాత్రమే ఈ పిల్స్ ఇవ్వాలి. కానీ ఏడునెలల గర్భిణికి ఇవ్వడంతో గర్భంలోనే శిశువు మరణించడంతో పాటు ఆమెకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీంతో ఆమెను హుజూర్‌నగర్ నుంచి మఠంపల్లిలోని ఓ ఆయుర్వేద వైద్యుడు నరేందర్ వద్దకు తీసుకెళ్లారు. అతను కూడా ప్రయత్నించి తన వల్ల కాదని చేతులెత్తేశాడు.

అసలేం జరిగిందంటే..

డీఎంహెచ్‌ఓ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌కు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ప్రాంతానికి చెందిన సుహాసినితో 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడోసారి గర్భం దాల్చడంతో మగ పిల్లాడు కావాలనుకున్న హరిసింగ్.. తనభార్య సుహాసినిని కోదాడలోని విజయవైద్యశాలకు తీసుకెళ్లి లింగనిర్ధారణ పరీక్షలు చేయించాడు. ఆడ పిల్ల అని తేలడంతో అబార్షన్ చేయాలని అక్కడి డాక్టర్ గురవయ్యను కోరాడు. ఇద్దరి మధ్య బేరం కుదరకపోవడంతో ఓ ఆర్‌ఎంపీ సాయంతో హుజూర్‌నగర్‌లోని కమల ఆస్పత్రిలో అబార్షన్ చేయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు.

తెలిసీతెలియని వైద్యంతో..

సుహాసినికి లింగనిర్ధారణ చేసిన కోదాడ విజయ వైద్యశాలలో పని చేస్తున్న ఇద్దరు కాంపౌండర్లు గోపి, సైదులు రంగంలోకి దిగారు. కడుపులో ఉన్న మృత శిశువును తాము బయటకు తీస్తామని ఆమెను హుజూర్‌నగర్ సమీపంలో ఉన్న ఓ మామిడి తోటలోకి తీసుకెళ్లి ప్రయత్నించారు. మృత శిశువును సగం బయటకు తీశారు తెలిసీ తెలియని వైద్యంతో సుహాసిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో భయపడ్డ గోపి అక్కడి నుంచి పరారయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుహాసినిని మరో కాంపౌండర్ సైదులు, ఆమె భర్త కలిసి మరోసారి కోదాడలోని విజయవైద్యశాలకు తీసుకొచ్చారు. డాక్టర్ గురవయ్య తన వల్ల కాదని చెప్పడంతో కోదాడ నుంచి ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా మార్గ మధ్యలో సుహాసిని మృతి చెందింది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



60 అంకె ఆకారంలో కూర్చున్న హుజూర్‌నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

హుజూర్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయవాణి దేవి అన్నారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నూతన ప్రవేశాలు 60కి చేరిన సందర్భంగా శనివారం విద్యార్థులు 60 అంకె ఆకారంలో కూర్చొని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులు చెప్పేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రావు, ప్రసాద్, విజయలక్ష్మి, అన్వేష్, శేషగిరి, అస్మాముబీన్, మున్నీబేగం పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణ ఆపాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సింగరేణి ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది కుటుంబాలు సింగరేణిపై ఆధారపడి జీవిస్తున్నాయని, సింగరేణిని ప్రైవేటీకరణ చేసి వారిని రోడ్డున పడేసే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా ఏకపక్షంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపాలన్నారు. సమావేశంలో నాయకులు నారి ఐలయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు మల్లు గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

సూర్యాపేటటౌన్ : పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు సంవత్సరాల నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. 2019 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటివరకు రూ.8214.57 కోట్ల ఫీజులు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు రాలేదన్న పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు విద్యార్థుల బకాయిలను విడుదల చేయలేదన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, భానోత్ వినోద్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు అక్కినపల్లి వినయ్, తాళ్ల వినయ్ కంప సాటి విష్ణు, తన్వేష్, అభి, అనిల్, సుమన్ రవి, శంకరయ్య, గిరిబాబు, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.